సాక్షి ఖమ్మం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



ఖమ్మం నుంచి ఒడిశా..

టీఎస్ ఆర్టీసీ, ఒడిశా ఆర్టీసీ నడుమ కుదిరిన ఒప్పందంతో ఖమ్మం మీదుగా ఒడిశాకు బస్సుల రాకపోకలు పెరగనున్నాయి. 8లో



ప్రజల సంక్షేమమే లక్ష్యం

ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 17°

వాతావరణం

శుక్రవారం ఉదయం నుంచే జిల్లాలో ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంది.

ప్రజలకు అండగా 'సాక్షి'

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'



ఖమ్మంమయూరిసెంటర్: నగర వాసులను కుక్కలు, కోతుల బెడద వేధిస్తోంది. దీనికి తోడు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య ఎదుర్కొంటున్న వారు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' సమన్వయం చేయాలని సంకల్పించింది. ఈమేరకు శనివారం ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి పాటుపడతారు.

తేది : 25 - 02 - 2023, శనివారం
సమయం : ఉదయం 10నుంచి 11గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
79012 98265

న్యూస్‌రీల్

స్టెరిలైజేషన్ సంఖ్య పెంచాలి..

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో కేఎంసీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన యానిమల్ డే కేర్ సెంటర్‌లో స్టెరిలైజేషన్ సంఖ్య పెంచాలని అధికారులు ఆదేశించారు. జిల్లా కేంద్రంలో వీధికుక్కల బెడద, స్టెరిలైజేషన్ వివరాలతో 'సాక్షి'లో గురువారం 'వీధికుక్కల వీరవిహారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రోజుకు 10 నుండి 12 కుక్కలకే స్టెరిలైజేషన్ నిర్వహిస్తుండగా.. ఇక నుండి రోజూ 25 కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ప్రతిరోజు 25 కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే, ప్రస్తుతం ఉన్న వెటర్నరీ వైద్యుడికి తోడు మరో వైద్యుడిని నియమిస్తున్నట్లు తెలిపారు.

'ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్'కు మాస్టర్స్ అవార్డు

ఖమ్మం సహకారనగర్: ఐఐటీ ముంబై స్పోకెన్ ట్యూటోరియల్స్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సుల్లో ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు వేయి మంది ప్రవేశాలు పొందారు. దీంతో కళాశాలకు మాస్టర్స్ అవార్డు ప్రకటించారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు మార్చి 4వ తేదీన ముంబైలో అందజేయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరేలా కృషి చేసిన అధ్యాపకులు ప్రత్తిగడప అనురాధ, ఈ.యాలాద్రిని ఆయన అభినందించారు.

ముస్తఫానగర్ ఆస్పత్రిలో ఎన్‌క్వాస్ బృందం



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం

ఖమ్మం వైద్యవిభాగం: నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) బృందం గురువారం జిల్లా కేంద్రంలోని ముస్తఫానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించింది. డాక్టర్ సెల్వకుమార్, బిందుతో కూడిన బృందం ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించడమే కాక సేవలు, పరికరాలు, ఔషధాల రికార్డులను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాంబాబు, ఎన్‌హెచ్ఎం అధికారి నీలోహన, జిల్లా క్వాలిటీ మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూమికి హద్దులు



హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీగుంటమల్లేశ్వర స్వామి పట్టా భూమి సరిహద్దులను నిర్ధారించారు. సర్వే నంబర్లు 165, 166లోని 4-19 ఎకరాల పట్టాభూమికి సర్వేయర్ లక్ష్మణ్, ఏడీ కార్యాలయానికి చెందిన నూరుదు గురువారం హద్దులను నిర్ణయించగా జేసీబీతో కందకం తీయించారు. దేవాలయ చైర్మన్ జి.లక్ష్మీనారాయణ, దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు ఆర్.సమతతో పాటు కేశగాని రవి పాల్గొన్నారు.

మడులకు తడులెలా?

విద్యుత్ కోత..
సాగునీటి కొరతతో ఇక్కట్లు

- కరెంట్ అంతరాయానికి తోడు ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు
- సాగర్ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు అందని నీరు
- యాసంగి పంటలపై రైతుల్లో ఆందోళన



విద్యుత్ సరఫరాలో అంతరాయంతో నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలో నెర్రెలు బారిన వరి పొలం (ఇన్‌సెట్) నీరు లేని ముదిగొండ మండలం అమ్మపేటలోని మొక్కజొన్న పంట

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యాసంగి పంటలు చేస్తున్న రైతులకు నీటి కష్టాలు తప్పడం లేదు. విద్యుత్ మోటార్లకు అమర్చిన ఆటోమెటిక్ స్టార్టర్లను ఆ శాఖ అధికారులు తొలగిస్తుండగా.. మరోపక్క సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరు అందక పోవడంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. యాసంగిలో జిల్లావ్యాప్తంగా 3,00,764.09 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు సాగు చేయగా, ఇదే సమయాన సాగర్ నుంచి నీటి సరఫరా తగ్గిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో మడులు ఎండిపోతున్నాయి. కరెంట్ ఎప్పుడు వస్తోందో.. ఎప్పుడు రాదో తెలియని పరిస్థితుల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు.

పొలాల వద్ద పడిగాపులు..

రైతులకు పొలాల వద్ద పడిగాపులు తప్పడం లేదు. జిల్లాలో 1.06లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఈ సర్వీసులకు రోజుకు పది గంటలపై విద్యుత్ సరఫరా నిలిపేస్తుండడం పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. రైతులు యాసంగిలో ఎక్కువగా వరి సాగు చేయడంతో నీరు అధికంగా అవసరమవుతుంది. కానీ విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు కోత విధిస్తున్నారో తెలియక రైతులు పొలాల వద్ద నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్నారు.

యాసంగిలో అత్యధికంగా సాగు చేసిన పంటలు

పంట	ఎకరాలు
వరి	2,04,792
మొక్కజొన్న	88,712
పెసర	2,683
చెరకు	2,403
వేరుశనగ	489
మిర్చి	318
నువ్వులు	325
పత్తి	143

స్టార్టర్ల తొలగింపుతో..

ఒకవైపు 24 గంటల విద్యుత్‌కు అంతరాయం కలుగుతుండగా, ఎప్పుడు విద్యుత్ సరఫరా ఇచ్చినా మోటార్లు నడిచేలా రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లను అమర్చుకున్నారు. అయితే, కరెంట్ రాగానే మోటార్లు అన్నీ ఒకేసారి ఆన్ అయి ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి కాలిపోతున్నాయని చెబుతూ విద్యుత్ శాఖ అధికారులు తొలగిస్తున్నారు. దీంతో రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియకపోవడంతో స్టార్టర్లు ఏర్పాటుచేసుకున్నామని, సరఫరాలో లోపాలను సరిచేయకుండా స్టార్టర్లు తొలగించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తుండగా... అధికారులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తొలగిస్తున్నామని చెబుతున్నారు.

మొక్కజొన్న ఎండిపోతోంది..



బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధి ఆళ్లపాడు మైనర్‌కు సాగర్ జలాలు సక్రమంగా రావడం లేదు. నాలుగు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న నీరు లేక ఎండిపోతోంది. బీబీసీకి 1,300 క్యూసెక్కుల నీటికి బదులు 600 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. తద్వారా చివరలోని మా భూములకు నీరందడం లేదు. రూ.లక్ష పెట్టుబడి, రూ.80 వేలు కౌలు కోసం చెల్లించా. సాగర్ జలాల కోసం ఆందోళన చేసినా ఫలితం లేదు. వారబందీ విధానం ఎత్తేస్తే ఫలితం ఉంటుంది.

– చిన్నకేశి గోపి, రైతు, ఆళ్లపాడు, బోనకల్

సాగర్ జలాల్లో కోత

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇన్‌ఫ్లో తగ్గిపోవడం, కాల్వల్లో పూడిక తదితర కారణాలతో చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడం లేదు. సాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరుకు 6,400 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం 3వేల నుంచి రూ.3,200 క్యూసెక్కులే వస్తోందని అధికారులే చెబుతున్నారు. అసలే చివరి ఆయకట్టుకు నీరు అందడం కష్టతరమైన సమయాన సగానికి సగం ఇన్‌ఫ్లో తగ్గడం వల్ల వేలాది ఎకరాలకు నీరు సరిపోవడం లేదు.

- **బోనకల్ మండలంలోని** మోటమర్రి, ఆళ్లపాడు, గోవిందాపురం, **మధిర మండలంలోని** బయ్యారం, అల్లినగరం, మడుపల్లి, ఇల్లూరు, రాయపట్నం గ్రామాల పరిధిలో సాగుచేసిన మొక్కజొన్న, వరి పంటలకు బోనకల్ బ్రాంచి కెనాల్ నుంచి నీరు సరిగా అందడం లేదు. ఇప్పటికే ఇక్కడి రైతులు పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. **ఎర్రుపాలెం మండలంలోని** ఆయకట్టు శివారు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.
- **నేలకొండపల్లి మండలంలోని** చెరువుమాదారం, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, చెన్నారం తదితర గ్రామాల్లో వరి పంటలకు తడి లేక నెర్రలు బారాయి. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు చేతికందడం కష్టమని చెబుతున్నారు.
- **ఏన్కూరు మండలంలో** తరచుగా త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. విద్యుత్ ఎప్పుడు వస్తుందోనని రైతులు ప్రతిరోజు నిరీక్షిస్తున్నారు. యాసంగిలో వరి సాగు మొదలై ప్రస్తుతం పంటలు బాగానే ఉండగా.. రాబోయే రోజుల్లో పైనంపల్లి తండాలో పంటలు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది.
- **ముదిగొండ మండలం** అమ్మపేట, వల్లాపురం, మల్లారం, పెద్దమండవల్లోని చివరి భూములకు పూర్తిస్థాయిలో సాగర్ నీరు అందకపోవడమే కాక తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో మొక్కజొన్న ఎదుగుదల లేక నెల రోజులుగా రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

నీరు లేక.. మొక్కజొన్న దున్నేసి..



ఈ ఫొటోలో భూమి ఏం పంట సాగు చేయకుండా వదిలేసినట్లుగా ఉందా? కానీ కాదు! ఎర్రుపాలెం మండలం రామన్నపాలెంకు చెందిన కౌలు రైతు గుర్రాల పెద్ద సిద్ధారెడ్డి 15 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. సాగు ఖర్చు నిమిత్తం రూ.2.50 లక్షలు వెచ్చించిన ఆయన.. ఎకరానికి రూ.10వేల చొప్పున రూ.1.50 లక్షల కౌలు కూడా చెల్లించాడు. కానీ సాగర్ జలాలు రాకపోవడంతో మొక్కజొన్న పంట ఎండిపోగా గత్యంతరం లేక పంట పూర్తిగా దున్నేశాడు. సాగర్ జలాలు సకాలంలో అందకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని ఆయన వాపోతున్నాడు. సాగర్ ఆయకట్టు చివరలో భూములు ఉన్న రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది.



గుర్రాల పెద్ద సిద్ధారెడ్డి

ఈ–ఆఫీస్ ద్వారా ఫైళ్ల నిర్వహణ

- సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు స్నేహలత, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఫైళ్లు, పాత రికార్డుల నిర్వహణ, ఈ–ఆఫీస్ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడమే కాక మధ్యాహ్న భోజనం తదితర కారణాలతో బయటకు వెళ్లొద్దని తెలిపారు. ఇక ఫైళ్ల నిర్వహణ మొత్తం ఈ–ఆఫీస్ ద్వారానే చేపట్టాలని స్పష్టం చేశారు. మంచి భవనం అందుబాటులోకి వచ్చినందున గతంతో కంటే విధులు మెరుగ్గా నిర్వర్తించాలన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు


జిల్లాలో ఎన్నెస్పీ చివరి ఆయకట్టుకు వరకు సాగునీరు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో యాసంగి పంటలపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ సాగునీటి సరఫరాకు కార్యాచరణ రూపొందించాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూనే రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, కాల్వలు, చెరువులకు గండ్లు కొట్టకుండా వీఆర్ఏలతో పహారా ఏర్పాటుచేయాలని చెప్పారు.

లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలి

జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులు ఉదయం 7గంటల్లోగా క్షేత్ర స్థాయికి వెళ్లి పనులను పర్యవేక్షించాలని తెలిపారు. నర్సరీల్లో డిమాండ్ ఉన్న మొక్కలు పెంచాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలందరి ఆధార్ నంబర్లు సేకరించాలని, సోషల్ ఆడిట్ కింద గుర్తించిన నిధులు రికవరీ చేయాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో ఆర్.శిరీష, జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ వీ.వీ.. అప్పారావు, డీపీఓ విజయనిర్మల, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా!

రాక్ క్లైంబింగ్ చేసిన విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైయినర్ (ఇన్‌సెట్) తాళ్ల సాయంతో గుట్ట ఎక్కుతున్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహం విద్యార్థులు రెండు రోజుల పాటు సాహసయాత్రకు వెళ్లారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాక్ క్లైంబింగ్ సెంటర్‌కు వెళ్లిన వారు అక్కడ ప్రాథమిక శిక్షణ అనంతరం కొండలు, గుట్టలను తాళ్ల సాయంతో ఎక్కి ఔరా అనిపించారు. కళాశాల వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న 80మంది బాలురు, బాలికలు బస్సుల్లో వెళ్లగా యాత్రను గురువారం డీబీసీడీఓ జి.జ్యోతి ప్రారంభించారు. వసతిగృహ సంక్షేమాధికారులు వీరభద్రం, వెంకటేశ్వర్లు, జ్యోత్న్న తదితరులు పాల్గొన్నారు.

– ఖమ్మంమయూరి సెంటర్

తలసేమియాను నిర్మూలిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ బోస్

ఖమ్మం వైద్యవిభాగం: సమాజంలో ఆందోళనకరంగా మారుతున్న తలసేమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డీసీపీ ఏ.సుభాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం పెవిలియన్ మైదానం నుండి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ డీసీపీ బోస్ మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా బారిన పడిన చిన్నారుల కోసం సంకల్ప సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కాగా, చిన్నారులకు అవసరమైన రక్తం దానం చేసేందుకు తమ శాఖ తరఫున సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, వైద్యులు డి.నారాయణ మూర్తి మాట్లాడగా ర్యాలీలో చిన్నారులు, తల్లిదండ్రులు, పులిపాటి ప్రసాద్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, ఏంజిల్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఏఆర్ డీఎస్పీ ఈ.విజయ్ బాబు, డాక్టర్ పారా ఉదయ్, డాక్టర్ లక్ష్మీదీప, సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్, ఉపాధ్యక్షురాలు పి.పావనితో పాటు మమత, అనురాధ, బోస్ యాదవ్, శ్రీకాంత్, ఉదయ్‌భాస్కర్, అనిత, నెల్లూరి ఉపేందర్, వి.వెంకటేశ్వర్లు, వీణ పాల్గొన్నారు.

సమష్టి ఉద్యమాలతోనే రాజ్యాధికారం



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: అన్ని పార్టీల్లోని బీసీ నాయకులు, ఉద్యోగులు, కులసంఘాల బాధ్యులు సమష్టిగా ఉద్యమిస్తేనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఖమ్మంలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10న సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల నాయకులు డాక్టర్ గుండు హరికిషోర్‌గౌడ్, మేడేపల్లి కృష్ణమాచారి, లిక్కి కృష్ణారావు, జి.శ్రీనివాస్, నాగేశ్వరావు, పంతంగి వెంకటేశ్వరావు, రామకృష్ణగౌడ్, పుల్లారావు, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్ గౌతమ్‌ను ఖమ్మంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ గురువారం సాయంత్రం కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో సమావేశమైన ఆయన మధిర నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అక్రమ రవాణా, లైంగిక దోపిడీని అరికడదాం

జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కొణిజర్ల: బాలలు, మహిళల అక్రమ రవాణా, లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. కొణిజర్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సాయంత్రం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు బలవంతంగా తీసుకెళ్తున్న కొందరు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక వరకట్నం కారణంగా కుటుంబాల్లో తగాదాలు జరుగుతున్నాయని.. దీనిని అరికట్టేందుకు వరకట్న భూతాన్ని పారద్రోలేలా ప్రతిన బూనాలని సూచించారు. కాగా, భ్రూణహత్యలు(అబార్షన్లు)లో తెలంగాణలోనే ఖమ్మం ప్రథమ స్థానంలో ఉన్నందున ఆడ, మగ తేడా లేకుండా పిల్లలపై సమదృష్టి కనబరిచేలా తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాల్సిన అవసరముందని చెప్పారు. ఈ సదస్సులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, తహసీల్దార్ దొడ్డారపు సైదులు, సర్పంచ్ సూరంపల్లి రామారావు, న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, రాజబోయిన శ్రీనివాసరావు, ఎస్సై శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

26న డీఏఓ పరీక్ష

- హాజరుకానున్న 9,456మంది
- జిల్లా కేంద్రానికి చేరిన ప్రశ్నాపత్రాలు



ప్రశ్నపత్రాల బండిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ల (డీఏఓ) నియామకానికి గాను టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఈనెల 26వ తేదీన రాతపరీక్ష జరగనుంది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరగనుండగా, 9,456మంది అభ్యర్థుల కోసం జిల్లాలో 27 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి 12–30గంటల వరకు జరిగే పరీక్షకు 8–30నుంచి 9–45గంటల వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారు. అలాగే, మధ్యాహ్నం 2–30నుంచి 5గంటల వరకు జరిగే పరీక్షకు 2–15గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థలతో పాటు పెద్దతండా సమీపంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల, తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల, పాన్నెకల్లులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలు సైతం పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. కాగా, పరీక్ష నిర్వహణ నిమిత్తం గురువారం ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకోగా కలెక్టరేట్‌లోని ఖజానా శాఖ స్ట్రాంగ్‌రూమ్‌లో డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, ఖజా నాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ నేతృత్వంలో భద్రపరిచారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల కట్టడి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ వారియర్



వీసీలో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: నేరాలు కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యాన నిందితులను గుర్తించేందుకు గాను పోలీసులు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. కమిషనరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పోలీసు అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేర పరిశోధన, దర్యాప్తు లోప రహితంగా ఉండాలని, నేరస్తులకు శిక్ష పడేలా చూడడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత కాలంలో దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇక సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా వేయాలని సీపీ సూచించారు. వీసీలో అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ఏసీపీలు రామోజీ రమేష్, గణేష్, రెహమాన్, రామానుజన్, బస్వారెడ్డి, ప్రసన్నకుమార్, రవి, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచి ఒడిశా..

పరుగు తీయనున్న ఆర్టీసీ బస్సులు

- టీఎస్ఆర్టీసీ – ఓడీఎస్ఆర్టీసీ నడుమ కుదిరిన ఒప్పందం
- ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం నుంచి అదనపు సర్వీసులకు అవకాశం
- ఇంతకాలం అధిక ధరలతో దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్



ఖమ్మంమామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం తెలుగు రాష్ట్రాలకు పెద్దసంఖ్యలో ఆదివాసీలు, ఇతరులు వస్తుంటారు. తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు పెద్ద సంఖ్యలో ఏటా వలసలు కొనసాగుతాయి. అయితే, తెలంగాణకు రావడానికి.. పనులు ముగిశాక స్వస్థలాలకు వెళ్లడానికి ఒడిశా వాసులకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఒడిశాకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుండగా వారు అధిక ధరలతో దోచుకుంటున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం మీదుగా ఒడిశాకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కొన్నేళ్లుగా విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యాన తెలంగాణ ఆర్టీసీ, ఒడిశా ఆర్టీసీ మధ్య తాజాగా కుదిరిన ఒప్పందంతో వారికి కొంత ఊరట లభించనుంది.

దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

హైదరాబాద్ నుంచి ఖమ్మం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట, జగదల్‌పూర్ ప్రాంతాలకు ఒక ఆర్టీసీ బస్సును తెలంగాణ ఆర్టీసీ అధికారులు తిప్పుతున్నారు. ప్రస్తుతం ఉన్న రద్దీకి ఆ బస్సు సరిపోవడం లేదు. దీంతో ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటున్న వలస కార్మికులు ఖమ్మం వరకు వచ్చి ఇక్కడ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్‌లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఖమ్మం నుంచి వారి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు రూ.500 నుంచి రూ.600 వరకు ఖర్చవుతుండగా.. ప్రైవేట్ ట్రావెల్స్‌లో మాత్రం రూ.వెయ్యికి పైగా వసూలు చేస్తున్నారు. ఖమ్మం మీదుగా ఒడిశా, కుంట, జగదల్‌పూర్ ప్రాంతాలకే కాక ఒడిశాకు బస్సులు లేకపోవడంతో ట్రావెల్స్ యజమానులు ఖమ్మం బస్టాండ్ నుంచి రాత్రి వేళ ఆ ప్రాంతాలకు బస్సులను నడుపుతూ వలస కూలీలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పెరగనున్న సర్వీసులు

టీఎస్ ఆర్టీసీ – ఒడిశా ఆర్టీసీ నడుమ కుదిరిన ఒప్పందంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు పట్టణాలకు ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్య పెరగనుంది. ప్రధానంగా ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం పట్టణాల మీదుగా కొత్త సర్వీసులు తిరుగుతాయి. టీఎస్ ఆర్టీసీ ఒడిశా రాష్ట్రానికి 10 సర్వీసులను, ఒడిసా ఆర్టీసీ తెలంగాణలో 13 సర్వీసులను తిప్పేందుకు అంగీకారం కుదిరింది. ఈ సర్వీసుల్లో అత్యధికంగా ఖమ్మం రీజియన్‌లోని భద్రాచలం మీదుగా తిరగనుండడంతో వలస కూలీలకు ఊరట కలగనుంది.

రీజియన్ నుంచి నడిపితే లాభమే..

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు బస్సుల ద్వారా ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరిగింది. గతంతో పోలిస్తే నిత్యం వందలాది మంది ఆ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాల నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ఖమ్మం రీజియన్ నుంచి ఆయా ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడిపితే ఇటు ప్రయాణికులకు, అటు ఆర్టీసీకి లబ్ధి చేకూరనుంది.

ఆదేశాలు రావాల్సి ఉంది..



ఒడిశా ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీ మధ్య సర్వీసులు నడిపేందుకు ఉన్నతస్థాయిలో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతానికి హైదరాబాద్ నుంచి ఈ సర్వీసులు తిరగనున్నాయి. ఖమ్మం రీజియన్ నుంచి బస్సులు నడిపే విషయమై యాజమాన్యం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ఖమ్మం రీజియన్‌లోని డిపోల నుంచి బస్సులు తిప్పేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఎస్తేర్ ప్రభులత, ఆర్ఎం, ఖమ్మం

క్లుప్తంగా

పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయండి

ఎంపీ నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు

కొణిజర్ల: మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలంతా ఏకతాటిపై నిలిచి ఏ ఎన్నికలు జరిగినా పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి కొణిజర్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్‌తో కలిసి ఎంపీ నామా మాట్లాడారు. మండలంలో గ్రూపులకు తావు లేకుండా కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో విజయానికి పాటుపడాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పోట్ల కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వై.చిరంజీవి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

చింతకాని: రాష్ట్రంలో అంధత్వ సమస్యతో ఎవరూ బాధపడకుండా రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సూచించారు. మండలంలోని జగన్నాథపురంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, సర్పంచ్ ఆలస్యం నాగయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, వైద్యాధికారి వెంకటేశ్వరరావుతో పాటు గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, కృష్ణారావు, వినోద్‌కుమార్, పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య, కోలేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఆదేశిస్తే వైరా నుంచి పోటీ

మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి

కారేపల్లి: ఇప్పటివరకు పార్టీలో క్రమశిక్షణతో కొనసాగుతున్న తాను సీఎం కేసీఆర్ ఆదేశిస్తే రానున్న ఎన్నికల్లో వైరా నుంచి పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తెలిపారు. కారేపల్లికి గురువారం వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సీఎం కేసీఆర్ నాయకత్వంలో పార్టీలో చేరానని, ఆతర్వాత ఎన్నికల్లో గెలవకున్నా కేసీఆర్ అప్పగించిన ప్రతీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించానని చెప్పా రు. నియోజకవర్గ ప్రజలతో అనుబంధం, ఇక్కడి సమస్యలు తెలిసిన వ్యక్తిగా తనను సీఎం గుర్తిస్తారనే నమ్మకం ఉందనితెలిపారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరినందున కచ్చితంగా బీఆర్ఎస్‌లో మూడోసారి అధికారంలోకి రావడం కాయమని చంద్రావతి ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మందడపు శంకర్‌రావు తదితరులుపాల్గొన్నారు.

ప్రతీ షాపులో సీసీ కెమెరా తప్పనిసరి

కూసుమంచి: ప్రతీ షాపులో యజమానులు సీసీ కెమెరా ఏర్పాటుచేసుకోవాలని కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడమే కాక, నిందితులను గుర్తించడం సులువవుతుందని తెలిపారు. ఇక గ్రామ కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్‌కుమార్, సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ పాల్గొన్నారు.

భార్య పిండప్రదానానికి వెళ్లి మృత్యువాత

గయలో మధిర వాసి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

మధిర: తోడునీడగా నిలిచిన భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. ఆమె చివరి కోరిక మేరకు గయలో పిండప్రదానం చేసేందుకు వెళ్లాడు. అయితే, అక్కడ భార్య జ్ఞాపకాలు వెంటాడాయో ఏమో కానీ ఆయన కూడా గయలోనే మృతి చెందాడు. వివరాలు... మధిరకు చెందిన కొల్లా నాగేశ్వరరావు(76) గతంలో వస్త్రవ్యాపారం చేయగా కొన్నాళ్లుగా మానేసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఆయనకు భార్యతో ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య మూడేళ్ల క్రితం మృతి చెందగా, కుమారుడు అమెరికాలో స్థిరపడ్డాడు. దీంతో భార్య కోరిక మేరకు అల్లుడు ఆదినారాయణ, కుమార్తెతో కలిసి నాగేశ్వరరావు ఇటీవల బిహార్ రాష్ట్రంలోని గయకు వెళ్లాడు. అక్కడ గురువారం మధ్యాహ్నం పిండ ప్రదానం కార్యక్రమాలు పూర్తిచేశాక సాయంత్రం వసతిగృహానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలోనే నాగేశ్వరరావుకు రాత్రి గుండెపోటు రాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై మధిరలోని బంధువులకు సమాచారం అందగా విషాదంలో మునిగిపోయారు.

ఇబ్బందులు ఉన్నా ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు
- ఎమ్మెల్యే సండ్రతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మర్లకుంటలో సీసీ రోడ్డు శిలాఫలకం వద్ద ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ప్రజాప్రతినిధులు

పెనుబల్లి : కేంద్రప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టిస్తున్నా కొనుగోలు చేసి మరీ రాష్ట్ర రైతాంగానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. పెనుబల్లి మండలం మర్లకుంటలో ఎన్ఆర్ ఈజీఎస్, డీఎంఎఫ్‌డీ నిధులు రూ.44 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, అడవిమల్లెలలో గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన గురువారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ దేశంలో రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ పథకాలను అమలుచేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. రైతులకు బాసటగా నిలిచిన కేసీఆర్‌కు, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సండ్ర వెంకటవీరయ్యతోపాటు తనను ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కాగా, అడవిమల్లె గురుకులంలో క్రీడామైదానం అభివృద్ధికి రూ.5 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నట్లు నాగేశ్వరరావు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే తన బంధువులని, వారి సంక్షేమమే తన ధ్యేయమని చెప్పారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడంలో తాను ముందు నిలుస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న వారందరూ కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఆతర్వాత పాతకారాయిగూడెంలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, తహసీల్దార్ ఎం.రమాదేవి, మార్కెట్ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, నాయకులు కొప్పుల గోవిందరావు, నాగమణి, మందడపు అశోక్‌కుమార్, కనగాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఆర్‌టీయూ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



స్థల పరిశీలనలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం వెనక పీఆర్‌టీయూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావు తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్ ఆమోదంతో 410చదరపు గజాల స్థలాన్ని తమ సంఘానికి కేటాయించారని చెప్పారు. కాగా, భూమి పూజకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

కార్యాలయాలకు భవనాల కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం వద్ద నిర్మించిన నూతన కలెక్టరేట్‌ను గత నెల 18న ప్రారంభించిన విషయం విదితమే. దీంతో జిల్లా కేంద్రంలోని ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను నూతన కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో ఆయా ప్రభుత్వ భవనాలు ఖాళీ కావడంతో... వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ వి.పి.గౌతమ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాత కార్యాలయం	కొనసాగనున్న శాఖ
డీఈఓ ఆఫీస్	సైన్స్ మ్యూజియం
డీఆర్‌సీ బిల్డింగ్	బీసీ గర్ల్స్ హాస్టల్
డీఆర్డీఓ మొదటి అంతస్తు	ఈఈ, ఆర్ అండ్ బీ ఆఫీస్, ఖమ్మం
డీఆర్డీఓ రెండో అంతస్తు	ఎస్ఈ, ఆర్ అండ్ బీ ఆఫీస్, ఖమ్మం
పాత మున్సిపాలిటీ (మైనార్టీ వెల్ఫేర్ ఆఫీస్)	ఈపీఎఫ్ ఆఫీస్, ఖమ్మం
పాత మున్సిపాలిటీ (ఏడీ, డ్రగ్ కంట్రోల్ అండ్ డీటీసీపీఓ)	పే అండ్ అకౌంట్స్
డీపీఓ ఆఫీస్	డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మం
డీడబ్ల్యూఓ ఆఫీస్ ఆర్ అండ్ క్వార్టర్స్ (ప్రపోజ్డ్)	డాక్టర్ ఎంసీహెచ్‌ఆర్‌డీ, ఐటీ, ఆర్‌సీటీ, ఖమ్మం
జీఎం డీఐసీ ఆఫీస్ ప్రిమిసెస్ (ప్రపోజ్డ్)	జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం
జీఎం డీఐసీ ఆఫీస్ ప్రిమిసెస్ (ప్రపోజ్డ్)	అసిస్టెంట్ కేన్ కమిషనర్
జెడ్పీ బిల్డింగ్, టూరిజం ఆఫీస్ స్పేస్ (ప్రపోజ్డ్)	డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్, ఎన్‌వైకే

కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి పరామర్శ



బాలుడి తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

ఖమ్మం వైద్యవిభాగం/కొణిజర్ల: కొణిజర్ల మండలం పెద్దగోపతిలో ఇంటి ముందు ఆడుకుంటు న్న బాలుడు ఊటుకూరి సిద్ధార్థపై బుధవారం కుక్కలు దాడి చేయగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈమేరకు గురువారం వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తదితరులు బాలుడిని పరామర్శించి ఆయన తండ్రి గణేష్‌తో కూడా మాట్లాడారు. అలాగే, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, నాయకులు పరికపల్లి శ్రీనివా సరావు, గుమ్మా రోశయ్య, రాయల పుల్లయ్య, గుండ్ల కోటేశ్వరరావు, గడల నరేంద్ర నాయుడు తదితరులు కూడా బాలుడి ని పరామర్శించి పరిస్థితిపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సాయికుమార్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని గోరీలపాడు తండాకు చెందిన తేజావత్ సాయికుమార్ (23) బుధవారం రాత్రి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో తండాలో విషాదం అలుముకుంది. ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష, ఈవెంట్లలో ఉత్తీర్ణత సాధించిన సాయికుమార్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటూ మెయిన్స్‌కు సిద్ధమవుతున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటికి వచ్చిన ఆయన తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం మృతదేహాన్ని తండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు. త్వరలోనే ఉద్యోగం వస్తుంది.. కుటుంబానికి అండగా నిలుస్తానని చెప్పే కొడుకు విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, సాయి కుటుంబాన్ని ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పరామర్శించారు.

మృతి చెందిన నెలన్నరకు పంచనామా

ఏన్కూరు: మండలంలోని జన్నారంలో వివాహిత ఆత్మహత్య చేసుకోగా.. తాజాగా అందిన ఫిర్యాదుతో పోలీసులు ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీయించి పంచనామా చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన షేక్ మదార్‌బీ(40) డిసెంబర్ 31న తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన అదే గ్రామానికి చెందిన అడపా శ్రీనివాస్ ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఆ సమయాన మదార్‌బీ కుమారుడు రావడంతో శ్రీనివాస్ పారిపోయాడు. ఈక్రమంలో అవమానం భరించలేక మదార్‌బీ పురుగుల మందు తాగగా ఖమ్మంలో ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ జనవరి 4వ తేదీన మృతి చెందింది. ఆ వెంటనే అంత్యక్రియలు నిర్వహించగా, కొద్ది రోజుల తేడాతోనే ఆమె మనవడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మదార్‌బీ కుటుంబీకులు విచారంలో మునిగిపోగా కేసు పెట్టడంలో జాప్యం జరిగింది. ఈమేరకు మదార్‌బీ భర్త షేక్ అలీసాహెబ్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ సాయికుమార్, తహసీల్దార్ ఎస్.కే.ఖాసిం, వైద్యాధికారుల సమక్షాన మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు.

పాల విక్రయ కేంద్రాల్లో శాంపిళ్లు సేకరణ



పాల శాంపిళ్లను పరీక్షిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ రోడ్డులో పలు పాలు విక్రయ కేంద్రాల్లో ఆహార తనిఖీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో పాల శాంపిళ్లు సేకరించి అక్కడికక్కడే మొబైల్ టెస్టింగ్ వాహనం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాలు, పాల ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ నోట్ల గుట్టురట్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు సభ్యుల ముఠా
- ఇల్లెందులో అరెస్టు.. కొత్తగూడెంనకు కేసు బదిలీ

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నకిలీ నోట్లు తరలిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా హైదరాబాద్ వైపునకు వాహనంలో నకిలీ నోట్లు తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. కొత్తగూడెం నుంచి కారు(టీఎస్ 09 ఎఫ్‌క్యూ 5695)లో రూ.లక్షల్లో అసలు డబ్బుతో కలిపి నకిలీ కరెన్సీని తరలిస్తున్నట్లు కొత్తగూడెం పోలీసులకు సమాచారం అందింది. ఈ ముఠాలో ముగ్గురు సభ్యులు ఉన్నట్లు తెలియగా వారు ఇల్లెందు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఇల్లెందు కరెంటాఫీస్ వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదునులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కారులో రూ.3 లక్షల అసలు నగదుతో పాటు పెద్ద మొత్తంలో నకిలీ నోట్లు, బ్లాక్ పేపర్లు ఉన్నట్లు గుర్తించారు. ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన టి.రాజశేఖర్, ఏపీలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం అనుముల లంక గ్రామా నికి చెందిన బి.రాంబాబు, కొత్తగూడెం బాబుక్యాంప్ ఏరియాకు చెందిన జె.భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని కేసును కొత్తగూడెంనకు బదిలీ చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ ఎస్‌వీ.రమణమూర్తి, సీఐ బి.రాజు వెల్లడించారు. కాగా, ఘటనపై కొత్తగూడెం పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించే అవకాశముంది.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలలు జైలు..

ఖమ్మంలీగల్: చెల్లనిచెక్కు కేసులో నిందితుడికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు జడ్జి శాంతిసోని గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కూరాకుల మోహన్‌బాబు వద్ద ఖమ్మంరూరల్ మండలం టీఎన్జీవోస్‌కాలనీకి చెందిన కొండూరి కిషోర్‌కుమార్ 2015 మార్చి 20న రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రుణంతిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయగా కిషోర్ 2017 మార్చి 20న రూ.3.70 లక్షలకు గాను చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకులో సమర్పించగా బౌన్స్ అయింది. దీంతో న్యాయవాది బిల్లా శ్రీనివాసరావు ద్వారా మోహన్‌బాబు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈ మేరకు కేసు విచారించాక కిషోర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి నగదు చెల్లించాలని సూచిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బాతుల పెంపకందారుడు హత్య

భార్య ప్రియుడే నిందితుడు...


చింతకాని: ఏపీలోని పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా కావలి మండలం రుద్రకోట నుంచి బాతుల పెంపకం కోసం చింతకాని మండలానికి వచ్చిన వ్యక్తి బుధవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాతుల పెంపకంతో జీవనం సాగిస్తున్న రుద్రకోటకు చెందిన పేరం వెంకటేశ్వర్లు(46) చింతకాని మండలం చిన్నమండవ గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో భార్య మరియమ్మతో కలిసి గ్రామ సమీపంలోని పొలాల్లో రెండు వారాలుగా నివాసముంటున్నాడు. అయితే, గతంలో బాతులతో కలిసి వివిధ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ఆయనకు కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ దుగ్గిరాల శివకృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈమేరకు మరియమ్మతో శివకృష్ణ నడుమ వివాహేతర సంబంధం మొదలైంది. దీంతో వీరిద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోగా వెంకటేశ్వర్లు అడ్డొస్తాడనే భావనతో హత్యకు పథకం రూపొందించారు. ఈక్రమంలోనే బుధవారం అర్ధరాత్రి గుడిసె వద్దకు వచ్చిన శివకృష్ణ మంచంపై పడుకున్న వెంకటేశ్వర్లు తలపై మట్టిగడ్డతో కొట్టి పరారయ్యాడు. అక్కడే ఉన్న మరియమ్మ కుమారుడు చినమండవకు వెళ్లి గ్రామీణ వైద్యుడిని తీసుకొచ్చేలోగా ఆయన మృతి చెందాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులకు గురువారం విచారణ చేపట్టారు. ఈక్రమంలో వెంకటేశ్వర్లు భార్య మరియమ్మను కూడా విచారించగా ఆమె తనకు శివకృష్ణతో ఉన్న వివాహేతర సంబంధాన్ని అంగీకరించింది. కాగా, మరియమ్మకు గతంలోనే వివాహం జరగగా, భర్తను వదిలేసి ముగ్గురు కుమారులతో వచ్చి వెంకటేశ్వర్లు వద్ద ఉంటోంది. ఘటనాస్థలాన్ని వైరా సీఐ సురేష్, ఎస్సై పొదిల వెంకటన్న పరిశీలించి మృతుడి బాబాయి అంకయ్య చేసిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

దిగజారిన 'ఈనాడు'

- అసత్య ప్రచారం మరోసారి బట్టబయలు
- ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మండిపాటు


అమర్


కొమ్మినేని

సాక్షి, అమరావతి: సీహెచ్ రామోజీరావు సారథ్యంలోని ఈనాడులో నిజాయితీ లోపించిందని.. మోసపూరిత, కుట్ర పూరిత అసత్య ప్రచారం మరోమారు తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావులు మండిపడ్డారు. పాత ఫొటోలతో పాఠకులను మోసం చేయడం దురదృష్టకరమని గురువారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అసలు నిజం బయట పడ్డాక, అది సాంకేతిక లోపం వల్ల జరిగిందంటూ లోపలి పేజీలో సింగిల్ కాలమ్ వార్తతో సమర్థించుకునే యత్నం మరీ అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే లక్ష్యంతో రాసినట్లున్న ఆ కథనంలో 2021 ఫిబ్రవరి 3వ తేదీ నాటి ఫొటోలను ముద్రించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆ ప్రకటనల్లో వారు ఇంకా ఏమేం చెప్పారంటే.. టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన వార్తలు బ్యానర్ గానే కాకుండా.. పుంఖానుపుంఖాలుగా మూడు పేజీల్లో పరిచిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తన వివరణను, విచారాన్ని మొదటి పేజీలో వేసి ఉంటే పత్రికా ప్రమాణాలను పాటించినట్లుండేది. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలికే క్రమంలో రామోజీరావు, ఆయన మీడియా నిస్సిగ్గుగా విశ్వసనీయతనే పణంగా పెట్టి అభూత కల్పనలకు పాల్పడి పరువు పోగొట్టుకుంది. ఈ ఘటనతో అయినా కళ్లు తెరవాలి. తాము ఏం రాసినా జనం నమ్మేస్తారనుకుని ఇంతకాలం జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు వంకర రాతల గుట్టును సోషల్ మీడియా రట్టు చేసింది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించారన్న పట్టాభి మాటలను పట్టుకుని, కనీసం విచారించకుండానే ప్రభుత్వ ప్రతిష్ట దిగజార్చాలనుకోవడం తగదు. ఈనాడుతో పాటు చంద్రబాబు విధేయ పత్రికలు, న్యూస్ చానల్స్ తమ వంకర, పక్షపాత, కుట్రపూరిత, మోసపూరిత ధోరణులకు ఇకనైనా స్వస్తి చెప్పాలి.

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగిసిన నిరసనలు

- పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం
- సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల మండిపాటు
- ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం
- చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం


కొయ్యలగూడెంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు'పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని ఏపీ వ్యాప్తంగా నిరసన ఎగసిపడింది. తప్పుడు వార్తలు రాసి.. ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సోషల్ యాక్టివిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో దహనం చేశారు. రామోజీరావు ఇంతగా దిగజారిపోవడం దారుణం అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వం మీద బురదజల్లడానికి ఈనాడు చేసిన కుట్ర మరోసారి బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడ్డాయి. వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్న సెంటర్లల్లో ఈనాడు రామోజీ రావు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అవి 2021లోని ఫొటోలని సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో ఎవరికీ కనిపించని రీతిలో రెండో పేజీలో సింగిల్ కాలంలో 'సవరణ'వేసి చేతులు దులుపుకుందని ఆందోళనకారులు మండిపడ్డారు. ఈనాడు పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి అని పెద్ద ఎత్తున నినదించారు. చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతోనే ఈనాడు పత్రిక దిగజారుడు వార్తలు, కథనాలు రాస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

ఇవి సోషల్ మీడియా రోజులు

పట్టాభి అనే వ్యక్తి జాతీయ నేతలా ఎల్లో మీడియా జాకీలు వేసి లేపుతోందని, ఇవి ఎల్లో మీడియా రోజులు కావని.. సోషల్ మీడియా రోజులు అని ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎల్లో మీడియా అని ముద్దుగా పిలుచుకునే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, అనుబంధ సంస్థలు ప్రచురిస్తున్న, చూపుతున్న వార్తలు, కథనాలు చూస్తుంటే ఇంకా దిగజారిపోవడానికి వారికి మెట్లు ఏమీ లేవు అని నిరూపించుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు మాత్రమే బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతం.. రామోజీరావుకు వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తూర్పారబట్టారు. కుట్రల రామోజీని బట్టలూడదీసి ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేటప్పుడు బ్యానర్ ఐటమ్స్.. సవరణకు మాత్రం సింగిల్ కాలమా? అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిలదీశారు. రామోజీ ఆరాటమే తప్ప.. చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్ లేదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ప్రజలను మోసం చేయాలని ఈనాడు యాజమాన్యం కుట్ర చేసిందని, సోషల్ మీడియా దెబ్బకు దిగొచ్చిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

రామోజీరావు దిష్టి బొమ్మ దహనం

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని విజయవాడలో పలువురు నేతలు మండిపడ్డారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ మంటల్లో ఈనాడు ప్రతులను తగులబెట్టారు.



కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం దంపతులకు గవర్నర్ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు. సీఎం జగన్ దంపతులు గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎం జగన్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్న విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- పట్టాభి ఘటనపై రామోజీకి ఏపీ మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం
- క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం
- రామోజీ అక్రమ సామ్రాజ్యానికి రక్షకుడు చంద్రబాబే



సాక్షి, అమరావతి: తప్పుడు కథనాలను ప్రచురిస్తున్న ఈనాడుపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్‌సీపీ యుద్ధం చేస్తుందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. పట్టాభి ఘటనలో సాంకేతికంగా జరిగిన తప్పులకు చింతిస్తున్నట్లుగా ఎవరికీ కనపడకుండా రామోజీరావు నాలుగు ముక్కలను ప్రచురించడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నేరపూరిత పరువు నష్టం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని హెచ్చరించారు. మంత్రి అంబటి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ పోర్న్ స్టార్లతో బూతులు..

రాజకీయంగా కథ ముగిసిన చంద్రబాబు పునరుజ్జీవం కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలను ప్రచురిస్తారా? టీడీపీ పోర్న్ స్టార్‌లు పట్టాభి, లోకేశ్, చింతకాయల అయ్యన్నలతో సీఎం జగన్‌ను బూతులు తిట్టిస్తూ చంద్రబాబు సైకోలా ఆనందిస్తుంటే ఆర్థిక నేరగాడు రామోజీరావు వాటిని ప్రచురించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మార్గదర్శి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి రూ.వేల కోట్లతో రామోజీ నిర్మించుకున్న అక్రమ సామ్రాజ్యానికి చంద్రబాబు రక్షకుడిలా వ్యవహరిస్తున్నారు. రామోజీ ఆరాటమేగానీ రాజకీయంగా చంద్రబాబు బతికి బట్టకట్టడం అసాధ్యం.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం

ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి: జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్న సంఘాల సమష్టి నిర్ణయం మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ తప్పుకుంటోందని ఆ కమిటీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. ఇక నుంచి తమకు ఆ సంఘంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చర్యల వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ఉద్యోగులందరూ ఆ సంఘానికి దూరంగా ఉండాలని సూచించారు. గురువారం ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లిలో నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. 'ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై పబ్లిసిటీ కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం. ఈ ఘటన వల్ల ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయి'అని తెలిపారు.

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.జానకీరామిరెడ్డి మరోసారి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి ఉప్పుటూరు వేణుగోపాలరావుపై 20 ఓట్ల తేడాతో గెలిచారు. మొత్తం 1,438 ఓట్లు పోల్ కాగా.. జానకీరామిరెడ్డికి 703, వేణుగోపాలరావుకు 683, మరో అభ్యర్థి డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబుకు 38 ఓట్లు వచ్చాయి. కొన్ని ఓట్లు చెల్లలేదు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. కాగా ఉపాధ్యక్షుడిగా పీఎస్‌పీ సురేష్‌కుమార్ గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి తుహిన్ కుమార్‌పై 52 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా సాల్మన్ రాజు, కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా జ్ఞానేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి పితాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అన్నం శ్రీధర్, మారుతి విద్యాసాగర్, కాశీ అన్నపూర్ణ, షేక్ ఆసిఫ్, శాంతికిరణ్, శరత్, అచ్యుత రామయ్య విజయం సాధించారు.

జిల్లా వార్తలు

ఎన్‌వైకే యూత్ వలంటీర్లుగా దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నెహ్రూ యువక కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యాన 2023–2025 సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లా పరిధిలోని నేషనల్ యూత్ వలంటీర్లనునియమించనున్నట్లు జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు. 18నుంచి 29ఏళ్ల వయస్సు కలిగి చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. యువజన సంఘాల స్థాపన, ఆరోగ్యం, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.5వేల గౌరవ వేతనం అందుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మార్చి 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 0870-2958776, 87906 01617 నంబర్లలో సంప్రదించాలని అన్వేష్ సూచించారు.

11, 12వ తేదీల్లో యంగ్ లీడర్స్ వర్క్‌షాప్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కళాశాలలో వచ్చేనెల 11, 12వ తేదీల్లో జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన యంగ్ లీడర్స్ వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులుగా ఎదగాలనుకుంటున్న వారికి మార్గనిర్దేశం చేసేలా నిష్ణాతులైన వక్తల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనాలనుకునే వారు వివరాల కోసం 90000 37676, 90000 74646 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏఐసీసీ ప్లీనరీకి పోదెం వీరయ్య, దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోదెం, పక్కన నాయకులు

భద్రాచలం అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరగనున్న ఏఐసీసీ ప్లీనరీలో భద్రాచలం ఎమ్మెల్యే, కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పోదెం వీరయ్య పాల్గొననున్నారు. అలాగే, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కూడా ఆయన వెంట గురువారం బయలుదేరారు. ఇంకా టీపీసీసీ సభ్యులు, నాయకులు బుడగం శ్రీనివాస్, రాయల నాగేశ్వరరావు, నల్లపు దుర్గాప్రసాద్, వడ్డే నారాయణరావు, సరెళ్ల నరేష్, సరెళ్ల వెంకటేష్ తదితరులు ప్లీనరీకి హాజరుకానున్నారు. ఈమేరకు భద్రాచలంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్లీనరీ వివరాలను పోదెం వీరయ్య వెల్లడించారు.

'ఉపాధి' వేటలో విషాదం

- మరిపెడ మండలం నుంచి క్యాటరింగ్‌కు వచ్చివెళ్తుండగా ప్రమాదం
- ఆటోను వేగంగా ఢీకొట్టిన గ్రానైట్ లారీ
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు, చికిత్స పొందుతూ ఒకరి మృతి




ఘటనా స్థలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న సాయికుమార్, మరో వ్యక్తి, పక్కన నుజ్జునుజ్జయిన ఆటో (ఇన్‌సెట్) ఆటోను ఢీకొట్టిన లారీ

ఖమ్మంరూరల్: ఒకరిద్దరు తప్ప అందరూ ఇంటర్, డిగ్రీ చదువుకుంటున్న వారు, పూర్తిచేసిన వారే. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వారు చదువుతో నిమిత్తం లేకుండా ఉపాధి వేటలో క్యాటరింగ్ పనులకు వెళ్తుంటారు. అలాగే ఖమ్మం జిల్లాకు వచ్చిన వారు ఆటోలో తిరిగి వెళ్లే క్రమంలో గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స అందిస్తుండగా ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

మరిపెడ నుంచి గొల్లగూడెం..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడుకు చెందిన పత్తిపాల గణేష్ క్యాటరింగ్ మేస్త్రిగా పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురితో జట్టుగా ఏర్పడి ఎక్కడ క్యాటరింగ్ పనులు జరిగిన వెళ్లివస్తారు. ఇందులో భాగంగానే గణేష్ సహా తొమ్మిది మంది గురువారం ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంలో ఓ వ్యక్తి దశదిన కర్మకు క్యాటరింగ్ చేయడానికి ఆటో మాట్లాడుకుని వచ్చారు. గొల్లగూడెంలో పని ముగిశాక సాయంత్రం తమ స్వగ్రామాలకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలోని కొండాపురం బస్టాప్ వద్ద వరంగల్ వైపు నుండి రాజమండ్రి వైపు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వారంతా ఎగిరి రహదారిపై చెల్లాచెదురుగా పడ్డారు. ఈ ఘటనలో మరిపెడ మండలం యలమంచిలిపురానికి చెందిన బానోత్ సాయికుమార్, గిరిపురానికి చెందిన బదావత్ మంగీలాల్, ఇటుకలపాడు తండాకు చెందిన భూక్యా రాందాస్, వెంకంపాడుకు చెందిన పత్తిపాల గణేష్(క్యాటరింగ్ మేస్త్రీ), ఇటుకలపాడుకు చెందిన భూక్యా సంతోష్, బదావత్ తండాకు చెందిన బదావత్ సుధీర్, బదావత్ రాజు, భూక్యా చరణ్, నటావత్ వెంకటేష్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, తలకు తీవ్ర గాయాలైన బానోత్ సాయికుమార్(19) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే, తలకు తీవ్ర గాయాలైన మంగీలాల్, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో వైద్యులు వీరికి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

చదువుకున్న వారే...

ప్రమాదం బారిన పడిన వారిలో ఒకరిద్దరు తప్ప మిగతా వారు ఇంటర్, డిగ్రీ వరకు చదువుకున్న, చదువుకుంటున్న వారేనని తెలుస్తోంది. చదువుకుంటూనే కుటుంబానికి చేదోడుగా ఉండటానికి క్యాటరింగ్ పనులు వెళ్తున్నారు. ఇలా అనుకోని ప్రమాదంలో ఒకరు మృతి చెందడం, మిగతా వారు తీవ్రగాయాల పాలు కావడంతో వారి కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇక లారీ బలంగా ఢీకొట్టగా ఆటోలోని వారు చెల్లాచెదురుగా రహదారిపై పడడంతో ఏం జరిగిందో తెలియక మిగతా వాహనదారులు ఆందోళన చెందారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలి

మావోయిస్టు పార్టీ బీకే – ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: ఎలాంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో తునికాకు సేకరణ చేపట్టడంతో పాటు కట్టకు రూ.3.50 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బోనస్ విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈమేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పూజారిగూడెం–లెనిన్‌కాలనీ మధ్య ప్రధాన రహదారిపై వాల్‌పోస్టర్లు, కరపత్రాలు వదిలారు. అందులోని వివరాల ప్రకారం.. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను పరిగణనలోకి తీసుకోకుండా ధర నిర్ణయిస్తున్నారని.. అలా కాకుండా కట్టకు రూ.3.50 చెల్లించాలని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో మొడెం కొట్టే పనులు చేపడుతున్న మధ్యవర్తులు వ్యవసాయ కూలీల కంటే తక్కువ కూలీ చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అన్ని ప్రాంతాలలో మొడెం కొట్టే పనులు తక్షణమే ప్రారంభించి, మొడెం కొట్టే కూలీలకు రూ.700 వేతనం, 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.50తో పాటు కార్మికులకు పెండింగ్ బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆకు సేకరణలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు రూ.2 లక్షలు, మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వాల్‌పోస్టర్లలో మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు

మహబూబాబాద్ రూరల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేసినా, రైళ్లపై రాళ్లు విసిరినా కఠిన చర్యలు తప్పవని కాజీపేట జీఆర్‌పీ డీఎస్పీ మల్లారెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న వందే భారత్ రైలుపై కొందరు రైళ్లు విసురుతున్నారని, ఇలా చేసే వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్సైలు కె.శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

భారజల కర్మాగారానికి 'బెస్ట్ ఫర్‌ఫార్మెన్స్' అవార్డు


జీఎం కేవీ.థాలేకు అవార్డు అందజేస్తున్న భారజల బోర్డు అధికారులు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారానికి 2021–22 ఏడాదికి గాను ప్రతిష్టాత్మక బెస్ట్ ఫర్‌ఫార్మెన్స్ ప్లాంట్ అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కర్మాగారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జీఎం కేవీ.థాలేకు ఐఎఫ్ఏ గోపాల ప్రసాద్, మనీషారాతి, బోర్డు సీఏఓ స్వామినాథన్ అవార్డు అందజేశారు. శక్తి వినియోగం, ఇంధన పొదుపు, ఉత్పాదకత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏటా ప్రకటించే ఈ అవార్డు 2020–21లోనూ మణుగూరు భారజల కర్మాగారానికి దక్కగా రెండో సారి కూడా అవార్డు రావడం విశేషం. ఈసందర్భంగా జీఎం కేవీ.థాలే మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల సమన్వయంతోనే రెండు సార్లు అవార్డు సాధించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం డీజీఎంలు జగ్గారావు, హరిప్రసాద్, సీఏఓ కాంబ్లే, ప్రొడక్షన్ మేనేజర్ జీ.శ్రీనివాస్, ఎంప్లాయీస్ అసోసియేషన్, సూపర్‌వైజరీ స్టాఫ్ అసోసియేషన్ల బాధ్యులు ఎం.వెంకటరెడ్డి, రాయల రాజేష్, విష్ణువర్ధన్‌రాజు, వేణుగోపాల్, కేటీ.రావు, జీఎస్.రెడ్డి, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ సీఈలకు సమ్మె నోటీసులు


జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబుకు నోటీస్ ఇస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులకు పీఆర్‌సీతో పాటు 2022, 1999–2004 బ్యాచ్ ఉద్యోగులకు జీపీఎఫ్ అమలుచేయాలనే డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని జేఏసీ నిర్ణయించింది. ఈమేరకు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస బాబుకు జేఏసీ బాధ్యులు సమ్మె నోటీసులు అందించారు. అనంతరం టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌కు అన్ని కార్యాలయాలు, సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలు చేపట్టనున్నామని తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1 నుండి 4వ తేదీ వరకు మధ్యాహ్న భోజన విరామంలో సమావేశాలు, 8న ర్యాలీలు, 14న కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో నిరసన, 24న విద్యుత్ సౌధ ఎదుట మహా ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు రాజేందర్, కోటేశ్వరరావు, మంగీలాల్, బ్రహ్మాజీ, శ్రీనివాసరావు, సీతారాంరెడ్డి, నాగరాజు, గణేష్, రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, నర్సింహారావు, రవీందర్, కోటేశ్వరరావు, రాందాస్, నాగేశ్వరరావు, గిరిధర్, నాగేశ్వరరావు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, సయ్యద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ ఎంపిక పోటీలు పూర్తి


ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్/కొణిజర్ల: సీనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు పురుషుల, మహిళల జట్ల ఎంపిక గురువారం చేపట్టారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యాన కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని గ్రేస్ విద్యాలయంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించగా ఖమ్మం డీవైఎస్ఓ ఏ.పరంధామరెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదుల సారంగపాణి, పుట్టా శంకరయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 మంది క్రీడాకారులు పాల్గొనగా, వివిధ విభాగాల్లో ఈ.ఆనంద్, కె.పృథ్వీ, కె.లక్ష్మణ్, కె.అశ్విత్‌దొర, శివసాయి, టి.సౌమ్య, టి.శేఖర్ ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పోటీల్లో వీరు పాల్గొంటారని డీవైఎస్ఓ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సంఘం ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, వెంకటనారాయణ, ఎస్.వెంకటరావు, గ్రేస్ ఉద్యోగులు వేణు, ప్రసాద్, వాణి, పుల్లారావు, కోచ్ మరెప్ప తదితరులు పాల్గొన్నారు.